

# రాగల రోజులు

**"హితశ్రీ"**

కాంతిహీనమైన కళ్లతో కాంతారావు వైపు చూసి నిమ్మదిగానవ్వింది కాంతిమతి.

"ఏం?" అన్నాడు కాంతారావు.

"మిమ్మల్ని చూసే." అంది కాంతిమతి, కాంతారావు కాంత. అతను మాట్లాడలేదు. కాంతారావు అప్పుడప్పుడు దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండటం, ఆ సమయాల్లో కాంతిమతి అతని వైపుచూసి విచారంగా నవ్వటం, కారణం విని అతను కళ్లు పక్కకి తిప్పి మళ్లీ ఆలోచనలో పడటం పరిపాటే.

"భావ సమాధిలోంచి ఇంకా తెప్పరిల్ల లేదా?" కాంతారావు ఆమెవైపు కళ్లు తిప్పి ఏమిటన్నట్టు చూశాడు.

"రాగల మంచి రోజుల్ని గురించేనా ఆలోచన?" అతను ప్రత్యుత్తరంగా చిరునవ్వునవ్వాడు. మళ్లీ కాసేపు నిశ్శబ్దం ఆవరించింది గదిలో.

"మీ కెన్నేళ్లు?" కాంతిమతి అకస్మాత్తుగా అడిగింది.

"ఏం, ఎందుకు?" ఆశ్చర్యంగా ఆమెవైపు చూసి అన్నాడతను.

"చెప్పండి."

"ముసలి వాళ్లమై పోతున్నామనే భయంకలిగిందా అకస్మాత్తుగా?"

"అదికాదు. ఆలోచించే ఈడు వచ్చినప్పటినుంచీ ముందువచ్చే మంచి రోజులకోసం ఎదురు చూస్తున్నా నన్నారుకదూ మీరోసారి. ఎన్నేళ్లయిందో లెక్క చూద్దామని."

కాంతారావు గత చరిత్రని ఓసారి సింహావలోకనం చేశాడు. మంచిరోజులు ముందున్నాయనే భావం ఎప్పుడు కలిగిందోగాని అప్పటినుంచీ రాగల ఆరోజులకోసం ఎదురు చూస్తూనే ఉన్నాడతను. జీవితంలో అడుగడుక్కీ తనకి కలిగిన కష్టాల్ని ఆ ఆశతోనే సహించుకో గలిగాడు. కష్టాలు కలకాలం కాపురముండవనే సూక్తి అతని మనస్సుకి బాగా నాటింది. తను ఊహించలేని సౌఖ్యం ఏదో రేపటి చీకటి దాచుకుందని ఏరోజు కారోజు తృప్తిపడటం అతనికి అలవాటయింది.

బుద్ధి తెలిసినప్పటినుంచీ కాంతారావు కష్టాల్ని ఎదుర్కోవాలి వొచ్చింది. బీదవాడు కావటంవల్ల వారాలు చేసి చదువుకున్నాడు. వారం ఇచ్చినందుకు ప్రతిఫలంగా దాతలకి అతను వెట్టి చాకిరీ చేయాలిసి వచ్చింది. ఈ రోజు కష్టపడితేనేం, ముందు ముందు హాయిగా ఉండొచ్చుగదా అని మనసుని సరి పుచ్చుకునే

వాడు. రాత్రిళ్లు వీధి లాంతర్లదగ్గర చదువుకుంటూ భవిష్యత్తులోకి తొంగిచూసి విద్యుద్దీపం ముందు చదువుతున్నట్టు కలలు కనేవాడు. ఆశ్రయింపులతో ఎలాగో బి. ఏ. పూర్తిచేశాడు. ఏం చదివినా, చెయ్యాలిసింది గుమాస్తా ఉద్యోగమేనని తెలుసుకుని తాత్కాలికంగా నిరుత్సాహపడ్డా, ముందున్న మంచిరోజుల్ని తలుచుకుని గుమాస్తాగా చేరాడు ఓ గవర్నమెంటు డిపార్టుమెంటులో. అప్పటినుంచీ సమర్థంగా నిర్వహిస్తూ వచ్చాడు ఆ పదవిని. కాణీ కూడా లంచం ఎరగడు. అధికార్లని పల్లెత్తుమాట అన్న పాపాన పోలేదు. అయితే కాకా పట్టీ ఎరగడు వాళ్ళకి. ఏదో కారణాన ఇంక్రిమెంట్లు ఎప్పటికప్పుడే ఆగిపోతూండటంచేత జీతం గొర్రెతోకలానే ఉంది. అధికార్ల రహస్య నివేదికల్లో ఇతన్నిగురించి మంచి వాక్యాలు ఎంచేతో లిఖించబడలేదు.

ఇటువంటి గుణగణాలు గలిగిన కాంతారావు తనకి రాబోయే మంచి రోజుల్నిగురించి అప్పుడప్పుడు కలలుకంటూ తాత్కాలికంగా కలిగే కష్టనిష్ఠూరాల్ని ఓపికతో ఓర్చుకోటం నేర్చుకున్నాడు. అయితే రాగల ఆ రోజులు యెంత దూరంలో ఉన్నాయోననే నిస్పృహకూడా అతనికి రోజులు గడిచిన కొద్దీ కలుగుతూనే ఉంది.

"మీ ఆలోచన ఇవాళ తెగేట్టు లేదల్లే ఉంది." అన్న కాంతిమతి మాటలు విని కాంతారావు ఊహించటం మాని, కిటికీలోంచి ప్రసరించే వెన్నెల్లో, ఆమె ముఖంమీది భావగర్భితమైన చిరునవ్వు చూసి అన్నాడు.

"దీపం వెలిగించరాదూ?"

"ఆలోచన మాని అన్నానికి లేస్తే వెలిగిస్తాను. లేకపోతే ఎందుకు?—కిరసనాయిలు దండగ!"

"ఐతే నువ్వుంటే ఇంకా దీపం ఎందుకులే."

"బావుంది" కాంతిమతి లేచి లాంతరు వెలిగించింది. దీపకాంతితో గదిని అంతదాకా ఆవరించిఉన్న చీకటి మటుమాయ మయింది. అది గమనించి అన్నాడు కాంతారావు:

"ఈదీపం గదిలో చీకటి పోగొట్టినట్టుగానే ఓరోజు ఉదయం మన కష్టాల్ని తరిమేస్తుంది."

రాగల మంచిరోజులు తలుచుకున్నాడు మళ్ళీ కాంతారావు. ఓరోజు-తనకి ప్రియమైన రోజు-ఉదయిస్తుంది-ఉదయించక తప్పదు. ఎప్పుడో ఆ శుభముహూర్తం!

నవ్వింది కాంతిమతి, కాంతారావు మీద దృష్టినిలిపి.

"ఏం? అన్నాడు కాంతారావు ఆమె నవ్వు విని.

"మిమ్మల్ని చూసే" అందామె.

* * *

రాగల రోజుల్లో కాంతారావు చూడగల రోజులు ఒక్కొక్కటిగా తగ్గిపోతున్నాయి. కాంతారావు చూస్తూండగానే ప్రతి రోజూ "నేను నీకోసం కాద"న్నట్టుగా దొర్లిపోతోంది. తెల్లవాళ్లు ముల్లె మూటకట్టుకుని సెలవు తీసుకున్నారు. మనవాళ్ళ చేతుల్లోకే మన దేశపు స్టీరింగు చక్రం వచ్చింది.

"చూశావా?" అన్నాడు కాంతారావు.

"ఏమిటి?" అంది కాంతిమతి నిర్లిప్తంగా. ఆమెకి జీవితంలో ఏ ఒకటి, రెండుసార్లో తప్ప కుతూహలపరిచే వార్తలు వినరాలేదు. ముఖ్యంగా ఆమెకి కాంతారావు చెప్పే ఉత్సాహకరమైన వార్తలేవీ ఉండవని ఆమె నమ్మకం.

"మన మంచిరోజులు కనుచూపు మేరలో ఉన్నాయి. స్వరాజ్యం వొచ్చింది."

"చూద్దాం."

"నువ్వింకా అనుమానిస్తున్నావల్లే ఉంది. కాంతీ, పరాయివాళ్ల పాలన కనుక నేను పైకి రాలేకపోయాను కాని ... ఎందుకులే, నువ్వే చూస్తావుగా."

కాంతిమతి పెదవులతో నవ్వింది; కళ్లలో వెలుగు ప్రతిఫలించలేదు. కాంతారావు కాస్త నిరాశ పొంది అన్నాడు:

"నువ్వింత నిరాశావాదివేం కాంతీ?"

కాంతిమతి వేదాంతిలా చిరునవ్వు నవ్వింది. ఆమె ముఖంలో ఏభావమూ ప్రస్ఫుటం కాలేదు.

స్వరాజ్యం వొచ్చి సంవత్సరం గడిచింది. "అబ్బా! అప్పుడే సంవత్సరమయిందే!" అనుకున్నాడు కాంతారావు. రెండో సంవత్సరం కూడా గడిచింది. "ఏమిటీ!" అనుకున్నాడు. కాంతారావు. మూడో సంవత్సరం గడుస్తోంది.

"ఇహ ప్రభుత్వం స్థిరపడ్డట్టే. జీవితంలో సుఖం చవిచూసే రోజులు దగ్గర్లోనే ఉండి ఉండాలి." అనుకున్నాడు కాంతారావు, ఎక్కడో ఓమూల వినిపిస్తున్న నిరాశాదేవత శంఖారావం వినట్టు నటిస్తూ.

*     *     *

"ప్రమోషన్ సంగతెలా ఉన్నా, తిండికీ, బట్టకీ అయినా కరువుండదులే ముందు." అన్నాడు కాంతిమతివైపు చూసి ఓ రోజు కాంతారావు.

"ముందు ముందు ఉండకపోవొచ్చు. అంటే మన తరవాత వాళ్ళకి."

"అబ్బే. మన సంగతే నేను మాట్లాడుతోంది."

కాంతిమతి మామూలుగా నవ్వింది. ఈసారి కాంతారావు కొంచెం చలించాడు. ఆలోచిస్తూ చూశాడు. ఏ విధమైన భావం- కోపం గాని, సంతోషం గాని, నిరాశ గాని లేక నిర్లిప్తంగా ప్రకాశించే ఆమె వదనం చూసి అతను అవ్యక్తమైన అనుభూతి ఏదో పొందాడు.

"నువ్వింత నిష్కామంగా ఎలా ఉండగలవు కాంతీ!"

"నేను నిష్కామంగా ఉన్నానని మీ కెలా తెలుసు."

"ప్రత్యక్షంగా కనపడుతూ ఉంటే యెలా తెలిసేదేమిటి? ఇంట్లో ఏదిఉన్నా, ఏది లేక పోయినా నువ్వు సణగటం నే నెప్పుడూ విన లేదు. పొరపాటునైనా నువ్వెప్పుడూ విసుక్కో లేదు. ఇంత ఓపిక, ఇంత సహనం నీకెలా అల వడ్డాయో నా కాశ్చర్యంగా ఉంది." ఆరాధనతో ఆమెవైపు చూస్తూ అన్నాడు కాంతారావు. ఈవిషయం తేల్చిగా తోసేసినట్టు చిన్నగా నవ్వి అంది కాంతిమతి.

"రాగల రోజుల్నిగురించి నే ననవసరమైన ఆశలు పెట్టుకోలేదు. ఉన్నదాంతో తృప్తిపడక పోతే శాంతి ఎక్కణ్ణించి వొస్తుంది?"

"ఉన్నదాంతో తృప్తిపడితే మనిషి ఉన్న చోటే ఉంటాడు."

"ఇప్పుడు మీరు పైకి పాకిపోయారా ఐతే?"

"నాలోపం ఏమీ లేదు."

"వాళ్ళేదో చేస్తారనీ, వీళ్ళేదో చేస్తారనీ అనవసరపు భ్రమలు పెట్టుకోట మెందుకు? మనసుని పాడుచేసుకోట మెందుకు? రాగల రోజులకోసం బతకటం, ఈ రోజుల్లో బతకటం దుర్భరమై తేనే. అంటే అశాంతి యెక్కువై తే ముందు రాగల సౌఖ్యం తలుచుకుని శాంతి పొందటం- అంటే బుద్ధిపూర్వకంగా భ్రమకి లోబడటమన్న మాట."

"ఈ వేదాంతమంతా యెక్కడ నేర్చుకున్నావు?"

"అనుభవంలో ఎప్పుడూ ఒకళ్ళమీద ఆశ పెట్టుకోగూడదని నా అభిప్రాయం. అది అనుభవంలో స్థిరపడ్డది. ఇం తెందుకు? మీ సొంత ప్రభుత్వం ఏం చేసిందో చెప్పండి మీ బాగు కోసం. చెయ్యలేక పోవటానికి కారణాలు వేశే ఉండొచ్చు. అది వేరే సంగతి."

కాంతారావు మాట్లాడలేదు. భవిష్యత్తు కోసం బతకటం భ్రమకి లోబడటమే కావొచ్చు. కాని అలాటి భ్రమలేకుండా ఎవరు బతకగలరు? రేపటి విషయం గురించి ఎవరికీ తెలియదు. ఈనాటి కటికచీకటి పోతే వొచ్చేది రేపటి వెలుగే. ఆ వెలుగు తన జీవితానికి వెలుగు ఇవ్వ వచ్చునని ఒక విధమైన ఆశ ప్రతి మానవుడికీ ఉంటుంది. అది లేకండా బతకగలగటం గొప్ప సంగతే. కాంతిమతికి భవిష్యత్తులో అసలు నమ్మకం లేదల్లే ఉంది. సరిగా ఆలోచిస్తే, నిజానికి అంతేగా మరి. తన పరిస్థితులు పూర్తిగా గ్రహించి అనవసరమైన ఆశలు పెట్టుకోకుండా వాస్తవికంగా ఆమె బతకదలిచింది. కాని ... కాని...తను జీవితాంతం వరకు ఇలాగే...గుమాస్తాగా...ప్రతి అవసరాన్ని వాయిదా వేస్తూ... గడపాలనే ఊహించటం- అసాధ్యం. తనకి మంచిరోజులు ముందున్నాయి. రాగల రోజుల్లో తను జీవితసౌఖ్యం అనుభవించగలడు! అవును.

ప్రతిరోజూ కాంతారావుని చూసి నవ్వుతూనే ఉంది. పాపం, కాంతారావు "రాగల రోజుల్ని గురించి కన్న కలల్లో ఒకే ఒక్కటి మాత్రం నిజమైందని గ్రహించాడు. అది కాంతిమతి వంటి భార్యని తను పెళ్లి చేసుకోగలగటం.

"చూశావా?"

"ఏమిటి?"

"ఆంధ్రరాష్ట్రం ఒస్తోంది. మన మంచి రోజులు మన ఊరి పొలిమేరదాకా వొచ్చి నట్టే" అన్నాడు నవ్వుతూ కాంతారావు.

"చూద్దాం."

"ఇంకా అనుమానమే!"

రాగల తన మంచిరోజుల్ని గురించి పగటి కలలు కనటం ప్రారంభించాడు కాంతారావు. చంద్రుడు ఆకాశంమీదికి పాకిపోతున్నాడు.

ఆలోచించే కాంతారావువైపు కాంతిహీన మైన కళ్లతో చూస్తూ విచారంగా నవ్వింది కాంతిమతి. ఆమె నవ్వు విని పరధ్యానంగా "ఏం!" అన్నట్టు ఆమెవైపు చూసి తల యెగర వేశాడు అతను.

"మిమ్మల్ని చూసే" అందామె.

తెలంగాణా తీరుతెన్నులు

# నియంతలూ: నరహంతలూ

పత్రిక చదువుతున్నవాడు కాస్తా నావేపు చూసి-'మీరంతా గుడ్డివాళ్లే'న్నాడు, స్వామి. చప్పున చేతులు కళ్లను తడుముకున్నాయి. కళ్లెప్పటిలాగే ఆడుతూనే వున్నాయి. అయితే, కళ్లుండీకూడా మనం ('మనం' అన్నందుకు కోప్పడకండి! స్వామి, తననుదప్ప మిగతా వాళ్ళందర్నీ గుడ్డివాళ్ళన్నప్పుడు అందులో మీరూ వుండి వుండకపోరనే నిశ్చయానికి రాక తప్పలేదు) గుడ్డివాళ్లమెలా అవుతామో ఆశ్చర్యంగా వుండొచ్చుగాని, స్వామి అనడానికి మాత్రం ప్రబలకారణా లుండకపోవని ఓపిక పట్టాలి మరి.

'ఎలా?' సందేహ నివృత్తి చేసుకోవద్దూ?

'ఈ ఉపన్యాసం చూశావా?' అన్నాడు.

'ఏ ఉపన్యాస' మన్నాను.

'నెహ్రూ ఉపన్యాస' మన్నాడు.

స్వామికంత కోపమేమిటని, అభివృద్ధి నిరోధకులం అసహ్యించుకోవడం పొరపాటు. కుల మత జాతి విభేదాలతో పాటు భాషా భేదాలు కూడా అంతరించాలని మరీ ముందుకు చూస్తున్నాడంటే. ఇక-దీన్నిగురించి ఎక్కువ పట్టింపు చేయడం ద్రోహం. అందుకనే-

'ఏమిటీ విశేషా' లన్నాను.

'దేశంలో అల్లర్లు యిలాగే కొనసాగితే నియంతృత్వ మొస్తుందని మొత్తుకుంటున్నాడు.'

'కావచ్చు.'

'అయితే-నీవూ ఆ విషయ మొప్పుకుంటున్నావా?'

'ఏం! నీవొప్పుకోవాయేమిటి?'

'ఎలా? నియంతృత్వం యిక ముందెప్పుడో రావడమేమిటీ? అది ఏనాడో వచ్చింది. అందుకనే-మీరు పరిస్థితులు చూస్తూకూడా అర్థం చేసుకోలేనివారు గనుకనే గుడ్డివాళ్ళనాల్సి వస్తున్నది' అన్నాడు.

హమ్మయ్య! మనం గుడ్డివాళ్ళమెందుకయ్యామో ప్రశ్నించకుండానే తేటతెల్లం చేసినందుకు ధన్యులం! అయినా, మళ్లీ కొన్ని సందేహాలు తప్పవు.

'మరి ఏనాడో నియంతృత్వమని తెలిపి పుణ్యం కట్టుకున్న మహానుభావులు మాత్రమెవరూ?' అన్నాను.

'అదీ, మావాళ్లొక్కళ్లే.'

అదీ విషయం! ఈ మధ్యంటే ఏదో పోలీసుల హడావుడినుండి తప్పుకోడానికి స్వామీ, వాడి అన్నా పార్టీకి రాజీనామా లిచ్చి వీల్లి కూనల్లా కనబడుతున్నారే గాని, ఆమధ్య పార్టీలో జోరుగా పనిచేస్తూ, ఒక్కొక్క వూళ్లో సభలు జరిగినపుడు నెహ్రూ రాజకీయాలూ, పటేలు బుర్రా, పట్టాభి సిద్ధాంతాలూ, ఆజాద్ తెలివితేటలూ, రాజాజీ ముందుచూపూ ...స్వామీ, వాళ్ల వుపన్యాసాల్లో నలిగి, వ్రక్కలై, చెక్కలై, క్రుంగి, కృశించి, నశించి, ముప్పతిప్పలుబడి, మూడు చెర్వుల నీళ్ళు త్రాగి, ఎందుకూ పనికిరాకుండా గాలిలో అలా అలా తేలిపోతే అవన్నీ అప్పుడే మరిచిపోయ్యామూ?

ప్రజలు చప్పట్లు చరవడం, ఉపన్యాసం ఉద్రేకవంతంగా పోవడం...ఇలాంటి మేధావు